క్లుప్తంగా

భూ ఆక్రమణదారులపై కేసు

కోటపల్లి: చెన్నూర్ పట్టణ సమీపంలోని బావురావుపేట శివారులో పట్టా భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాటి శ్రీనివాస్, బల్ల సదానందంకు చెందిన పట్టా భూమిలోకి ప్రవేశించి గుడిసెలు వేశారని ఫిర్యాదు చేయగా, సీపీఎం పార్టీ జిల్లా సెక్రటరీ సంకె రవి, బోడంకి చందు, ఎం.డి అవేజ్, కావిరి రవీందర్, జక్కుల మారయ్య, పడమటింటి నవీన్, దాసరి సంధ్య, ఎస్‌కే అస్మాబేగం, దాసరి రాజేశ్వరి, సుందిల్ల రాజేశ్వరి, మానెక్క, జగన్నాథుల మల్లక్క, తుమ్మ లావణ్య, నలిమెల పద్మ, గిరెల్లి మదునక్క, రేగల లక్ష్మి, రేణుకతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

సుంపుటంలో కమ్యూనిటీ కాంటాక్ట్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

వేమనపల్లి: మండలంలోని సుంపుటం గ్రామ పంచాయతీ కేంద్రంలో ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. 23బైక్‌లు, 2ఆటోలకు సరైన పత్రాలు లేనందున సీజ్ చేశారు. నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, సర్పంచ్ కొండగొర్ల బాపు, మాజీ సర్పంచ్ కుబిడె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమిని: కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని జంగంపల్లి శివారులో ఎస్సై నరేశ్ సిబ్బందితో సోమవారం కలిసి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. 12 మంది పేకాటరాయుళ్లకు గాను ఐదుగురిని అరెస్టు చేయగా, ఏడుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.8 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దశావతార దైవక్షేత్రం సందర్శన

వేమనపల్లి: గత జనవరి 21అమావాస్య రోజు అర్ధరాత్రి రాజారాంలోని రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద ఏం జరిగిందో బహిర్గతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ అన్నారు. సీపీఐ నాయకులు రాజారాం గ్రామస్తులతో కలిసి సోమవారం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన దశవతార దైవక్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమావాస్య రోజు ఎక్కడైనా గుడి నిర్మాణానికి భూమి పూజలు చేస్తారా? అని నిలదీశారు. ఎల్లమ్మతల్లి, దశవతార క్షేత్రం వద్ద గుడి నిర్మాణం పేరుతో గుప్త నిధుల కోసం అడ్డగోలుగా గోతులు తీశారని ఆరోపించారు. ఈ తవ్వకాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని గ్రామస్తులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లకుండా నాయకులు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై రూరల్ సీఐ విద్యాసాగర్ దృష్టికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అందె పురుషోత్తం, అందె మహేష్, గ్రామస్తులు బుర్స నాగయ్య, హన్మంతు, మల్లేష్, భీమయ్య ఉన్నారు.

తోట శ్రీనివాస్‌కు అభినందన


అభినందిస్తున్న తోట చంద్రశేఖర్

మంచిర్యాలటౌన్: లయన్స్‌క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడిగా తోట శ్రీనివాస్ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయన్ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో శ్రీనివాస్ బాధ్యత మరింత పెరిగిందన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మందమర్రిరూరల్: గత నెల 29, 30తేదీల్లో మంచిర్యాల జిల్లాలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మందమర్రిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు వంశీకృష్ణ(సిల్వర్ మెడల్), కార్తికేయన్ (బ్రాంజ్ మెడల్) ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి విద్యార్థులను అభినందించారు.


మందమర్రిరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

ఘనంగా మేడే వేడుకలు

లక్సెట్టిపేట/బెల్లంపల్లిరూరల్/నెన్నెల/దండేపల్లి/తాండూర్/బెల్లంపల్లి/చెన్నూర్/జైపూర్/నస్పూర్/వేమనపల్లి/రామకృష్ణాపూర్/కోటపల్లి/కాసిపేట/మందమర్రి రూరల్/భీమారం/జన్నారం/భీమిని/: ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రధాన కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా ర్యాలీలు నిర్వహించి, ఎర్రజెండా ఎగురవేశారు. చికాగో అమరవీరుల పోరాట ఫలితంగా సాధించిన అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, కార్మికుల సమస్యలపై అన్ని వర్గాల వారు సంఘటితంగా పోరాడాలని పలువురు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, టీఎస్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ టీ.మణిరాంసింగ్, ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా, హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఏఐటీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, శాలీవాహన పవర్‌ప్లాంట్ కార్మికసంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి: టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య


బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ


వేమనపల్లి: జెండా ఎగురవేస్తున్న నాయకులు


భీమారం: పోలంపల్లిలో ర్యాలీ


జెండా ఆవిష్కరిస్తున్న రంజిత్‌కుమార్


నస్పూర్: కార్మికులతో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు


చెన్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు


జన్నారం: ర్యాలీ తీస్తున్న కార్మిక సంఘం నాయకులు


కోటపల్లి: పారుపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు


దండేపల్లి: సీపీఐ ఆధ్వర్యంలో...


లక్సెట్టిపేటలో...


నెన్నెలలో...


తాండూర్‌లో...


బెల్లంపల్లి: జోహార్లు అర్పిస్తున్న కామ్రేడ్స్ రామకృష్ణాపూర్‌లో...

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్: మండలంలోని అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వేసవిలో చేపట్టనున్న ఉచిత శాస్త్రీయ నృత్యాలు, చెస్, అథ్లెటిక్స్ శిక్షణకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సేవా సంస్థ అధ్యక్షుడు అభినవ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 5 నుంచి తాండూర్-ఐబీలో ప్రారంభమయ్యే శిక్షణ శిబిరానికి ఆసక్తి గల వారు మే 3వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరం నెల రోజుల పాటు కొనసాగనుంది.మహిళలు, చిన్నారులు, విద్యార్థులు,యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.పూర్తి వివరాలకు 8074635262 ,9346649984 ,8919158374 నంబర్ లలో సంప్రదించాలని సూచించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ ఈఈ పి.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆసిఫాబాద్‌లోని 115ఎంఎల్‌డీ మిషన్ భగీరథ వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయనున్న దృష్ట్యా తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలతో పాటు బెల్లంపల్లి మున్సిపాలిటీలో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. తిరిగి ఈ నెల 3వ తేదీన తాగునీటిని పునఃరుద్ధరణ చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో...

నెన్నెల: నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నెన్నెల మండల ట్రాన్స్‌కో ఏఈ మల్లయ్య తెలిపారు. 33కేవీ కన్నెపల్లి ఫీడర్ మేయింటనెన్స్‌లో భాగంగా ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండలంలోని దేవునిగూడ, కామన్‌పల్లి, చర్లపల్లి గ్రామాల ట్రాక్టర్స్, హార్వేస్టర్ డ్రైవర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా జునుగురి గంగరాజం, ఉపాధ్యక్షుడిగా చాట్ల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా గొర్రె మహేశ్ యాదవ్, కోశాధికారిగా గడ్డి జగన్, సభ్యులుగా వెంకటేశ్, మధుకర్, శాంతి, చంద్రయ్య, నాగరాజు, సురేశ్ తదితరులు ఎన్నికయ్యారు.

జిల్లా కేంద్రంలో మే డే

పాతమంచిర్యాల/మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅర్బన్: మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం అండగా ఉంటామని, కార్మికులకు రావాల్సిన హక్కులను ప్రభుత్వం ద్వారా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, యూనియన్ అధ్యక్షుడు ఆశాలు, నవీన్, సత్తయ్య, సుధాకర్, కుమార్, సుమన్, రత్నం పాల్గొన్నారు. మంచిర్యాల డిపో సమీపంలో తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా రీజినల్ కార్యదర్శి భీమేశ్వర్‌రావు పతాకవిష్కరణ చేశారు. అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ గౌరవ అధ్యక్షుడు కలవేని శంకర్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. మార్క్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు జెండా విష్కరణ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండా లచ్చన్న జెండా ఆవిష్కరించారు.


జెండా ఎగురేస్తున్న కార్మికులు, పక్కన ఎమ్మెల్యే


ఆర్టీసీ డిపో సమీపంలో...


మార్క్స్‌భవన్‌లో...

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె


ముగ్గుతో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

పాతమంచిర్యాల/జన్నారం/భీమారం/దండేపల్లి/కాసిపేట: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుంది. పలు పార్టీల నాయకులు సోమవారం వారికి మద్దతు తెలిపారు. జన్నారంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నల్లగుడ్డలు మూతికి కట్టుకుని నిరసన తెలిపారు. కాసిపేటలో ముగ్గు వేసి నిరసన తెలిపారు. భీమారంలో సేవాలాల్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేశ్‌నాయక్, దండేపల్లిలో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు సందర్శించి సంఘీభావం తెలిపారు.

అన్నదాతలు ఆందోళన చెందొద్దు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు


తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యేకు చూపుతున్న రైతు

దండేపల్లి: అకాల వర్షానికి పంట దెబ్బతిన్న రైతులు, ధాన్యం తడిసిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు సూచించారు. దండేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓ రైతు వానకు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఎమ్మెల్యేకు చూపించి, రైతుల పరిస్థితి ఇలా ఉంది సార్ అని వాపోయాడు. ఈ విషయంలో ఎమ్మెల్యే స్పందిస్తూ, తడిసిన ధాన్యంను కొనుగోలు చేసే విషయంపై జిల్లా అధికారులతో సమావేశమై, విషయాన్ని, సంబంధిత మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీఎమ్మెఎస్ చైర్మన్ లింగయ్య, ఎంపీపీ శ్రీనివాస్, రైతు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, ఉప సర్పంచ్ భూమన్న, రైతులు, నాయకులు ఉన్నారు.

లక్సెట్టిపేట: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం కుప్పలు తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి పొలాలు పూర్తిగా పడిపోవడంతో కోయడానికి వీలు లేకుండా ఉంది. ఇటిక్యాలలోని కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే దివాకర్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షులు చిన్నయ్య, పట్టణాధ్యక్షులు శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు

- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు


ప్రజలతో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు, సురేఖ

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అన్ని విధాల మేలు జరిగిందని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం మాకులపేటలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుందన్నారు. రైతుబంధు పథకం అమలు చేసినప్పటికీ, కొనుగోళ్లలో కొర్రీలు పెట్టి రైతులను నిలువునా ముంచుతుందన్నారు. తరుగు పేరిట దోపిడీ, సకాలంలో కొనుగోళ్లు జరుపరు, తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించడంలోనూ జాప్యమే చేస్తూ, రైతులను అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. రైతులు బాగుపడాలంటే, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు త్రిమూర్తి, కాంతరావు, శంకరయ్య, తిరుపతి, తదితరులు ఉన్నారు.

తాళ్లపేటలో గడపగడపకూ కాంగ్రెస్..
వచ్చే ఎన్నికల్లో ఒక్కసారి తనకు అవకాశమిచ్చి గెలిపిస్తే, మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు అన్నారు. మండలంలోని తాళ్లపేటలో సోమవారం డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, యూత్ మండల అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, సర్పంచ్ పుష్పలత, నాయకులు కాంతరావు, సల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలపై ప్రభుత్వం చిన్న చూపు
మహిళా సంఘాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న వీవోఏలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. దండేపల్లిలో సమ్మె చేస్తున్న వీవోఏలకు సోమవారం మద్దతు తెలిపారు. వీవోఏల న్యాయపరమైన డిమాండ్లు తీర్చాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: వర్షాలు పడుతున్నాయని, ధాన్యం తడుస్తుందని రైతులు అధైర్య పడొద్దని, ధాన్యం తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని చింతగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పొనకల్, తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ధర్మారం మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రణవ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకుని, అక్కడికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రైతుల చివరి ధాన్యం వరకూ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రాజన్న, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ, జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, సర్పంచ్ జాడి గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం
పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని కల్వరీ యువశక్తి అనాథాశ్రమం నిర్వాహకులు ములుకాల కుమార్ మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం కల్పించి తమ మానవత్వం చాటుకున్నారు.

సమ్మెకు సంఘీభావం
బెల్లంపల్లిరూరల్: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపడుతున్న సమ్మెకు సోమవారం సంఘీభావం తెలిపారు.

కబరిస్తాన్‌కు స్థలం కేటాయింపు
కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి శివారు సర్వే నంబర్ 49లో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఆర్ఐ సులోచన, సర్వేయర్ రాజశేఖరచారి సందర్శించి భూమిని కబరిస్తాన్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి అని గుర్తించి అవసరాలకు కేటాయించినట్లు తెలిపారు.

చెట్లు విరిగిపడి కరెంట్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: పెనుగాలులు, భారీ వర్షం విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగించాయి. ఉరుములు, మెరుపులతో జోరు వానకురిసింది. పెను గాలులు వీయడంతో ఆదివారం రాత్రి 9గంటలకు ఒక్కసారిగా ప్రభుత్వ, సింగరేణి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ లేకపోవడంతో బెల్లంపల్లి అంధకారంలో మునిగిపోయింది. సోమవారం ఉదయం 10గంటల కల్లా కొన్ని బస్తీల్లో డిస్కం అధికారులు కరెంట్ సరఫరాను పునఃరుద్ధరించే యత్నాలు చేశారు. ఇంకా అనేక ప్రాంతాల్లో కరెంట్ సరఫరా జరగకపోవడంతో సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేశారు. ఇక సింగరేణి కార్మిక వాడల్లో దాదాపు 19గంటలు పాటు కరెంట్ లేకుండా పోయింది. సింగరేణి తిలక్ స్టేడియంలో భారీగా వరద నీరు నిలిచిపోయి కుంటను తలపించింది.

ఈదురుగాలులతో విరిగిపడిన కొమ్మలు
మందమర్రిరూరల్: మందమర్రిలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కోల్‌బెల్ట్ రహదారిపై పోస్టాఫీస్ వద్ద చెట్టు కొమ్మ విరిగిపడగా దాన్ని తొలగించే నాథుడే కరువయ్యారు. పలు కాలనీల్లో కూడా కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


దుబ్బగూడెంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

గాలివానకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
కాసిపేట: మండలంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సోమగూడెం లేఅవుట్ కాలనీ(పాతబస్తీ)లో, దుబ్బగూడెంలో విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు చేస్తున్నారు.